క్లుప్తంగా

గజ్జెల కాంతంకు ఎంపీ టికెటివ్వాలి



మాట్లాడుతున్న రాచపల్లి సాగర్

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతంకు కేటాయించాలని అంబేడ్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ కోరారు. శనివారం విలాసాగర్ గ్రామంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణలో 80 లక్షల మంది మాదిగలు ఉన్నారని, మాదిగలకు పెద్దపల్లి ఎంపీ సీటు విషయంలో ప్రతిసారి అన్యాయం జరుగుతోందని, ఈసారి మాదిగలకు కేటాయించాలని కోరారు. రాచపల్లి నవీన్, అంబాల అభిలాష్, మహేశ్, గణేశ్, తేజ, అన్వేష్, చంద్రగిరి రజనీకాంత్, అజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ

వీణవంక: బేతిగల్ గ్రామంలో పోచమ్మ గుడి పునఃనిర్మాణానికి భూమిపూజ వైభవంగా జరిగింది. అంతకుముందు అర్చకులు నరసింహాచారి, సాగర్ ఆధ్వర్యంలో గుడి ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లి విగ్రహాన్ని తీసి మరోచోట ప్రతిష్టించి భూమిపూజ చేశారు. బేతిగల్ వెలమ సంఘం ఆధ్వర్యంలో విరాళాలు వేసుకొని గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఏప్రిల్ చివరి వారంలో భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠాపనతోపాటు పోచమ్మ తల్లి ప్రతిష్ఠాపన చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వివిధ కుల సంఘాల బాధ్యులు, గ్రామస్తులు పెదఎత్తున తరలివచ్చారు.

దళితబంధు నిధులు మంజూరు చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న దళితబంధు సాధన కమిటీ సభ్యులు

జమ్మికుంట: దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలని కోరుతూ పాదయాత్ర చేపడతారని హుజూరాబాద్ నియోజకవర్గ దళితబంధు సాధన కమిటీ సభ్యులు కొలువురు సురేష్, మంద రాజేశ్, కొలువురు నరేష్‌ను శనివారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దళిత సాధన కమిటీ అరెస్టుకు నిరసనగా జమ్మికుంట అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి దళితబంధు సాధన కమిటీ ఆధ్వర్యంలో వినితి పత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతియుతంగా నిధుల విడుదల కోసం పోరాటం చేస్తున్న సమయంలో ముందస్తు అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామంచ రాకేశ్, అకినపల్లి ఆకాష్, నాగరాజు, రామంచ శ్రీకాంత్, కొర్రి సతీష్, కనుకం రత్నాకర్, ఎర్ర వంశీ, మంద వేణు, సరిత తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ప్రభాకరాచార్యులు

చొప్పదండి: చొప్పదండి మున్సిపల్ పరిధిలోని వెయ్యేళ్ల నాటి అతి పురాతన శివకేశవ దేవస్థాన అనువంశిక అర్చక సంక్షేమ కమిటీ అధ్యక్షుడిగా సింహాచలం ప్రభాకరాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెయ్యేళ్ల నుంచి శివకేశవ స్వాముల వారి సేవలో తరిస్తున్న పది అర్చక కుటుంబాలు శనివారం ఆలయంలో సమావేశమై అనువంశిక అర్చకుల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జనగామ సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా సింహాచలం జగన్మోహన్‌స్వామి, జనగామ రంజిత్‌కుమార్, కోశాధికారిగా సింహాచలం మురళీమోహనస్వామి, ప్రచార కార్యదర్శిగా తమ్మల్ల అఖిల్ ఎన్నికయ్యారు. అధ్యక్షుడు ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ.. అనువంశిక అర్చకుల సంక్షేమం కోసం పాటుపడుతానని, అర్చకుల హక్కుల సాధనకు సమష్టిగా ముందుకు సాగుతానన్నారు.

నూర్‌భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న అంకూస్

జమ్మికుంట: నూర్‌భాషా(దూదేకుల) కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆల్ బీసీ, మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్ విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలో విలేకర్లతో మాట్లాడారు. దూదేకుల ఫెడరేషన్ జీవో ఎంఎస్ నెంబర్ 125 అమలు చేయలేదని, ముస్లిం జనాభాలో అంతర్భాగమైన దూదేకుల జనాభా 70 శాతం ఉంటుందన్నారు.

కవిత అరెస్ట్‌పై బీఆర్‌ఎస్ ఆందోళన





రామడుగులో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వేంకటేశ్వరరావు, నాయకులు, మాట్లాడుతున్న రసమయి

మానకొండూర్: ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయడం దారుణమని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. కవితను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మానకొండూర్‌లో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ కవితను అరెస్ట్ చేసిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాటకాలాడుతున్నాయని అన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ దేవ సతీష్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, పిట్టల మధు, అనిల్, ఎడ్ల సతీష్, పిండి సందీప్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శనివారం రామడుగులో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వేంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన లిక్కర్ కేసులో కవితకు సంబంధం లేదన్నారు. గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, నాయకులు కలిగేటి లక్ష్మణ్, గంట్ల వెంకట్‌రెడ్డి, ఎల్కపల్లి లచ్చయ్య, పంజాల జగన్‌మోహన్‌గౌడ్, దాసరి రాజేందర్‌రెడ్డి, మామిడి నరసయ్య, చాడ ప్రభాకర్‌రెడ్డి, నాగి శేఖర్, బండ అజయ్‌రెడ్డి, ఒంటెల వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సైదాపూర్: బీఆర్‌ఎస్ మండల నాయకులు మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. కక్ష సాధింపులో భాగంగానే కవితను అరెస్ట్ చేయించారని మండల అధ్యక్షుడు రాజయ్య ఆరోపించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు గడ్డం చుక్కారెడ్డి, మాచర్ల విజయ్, అరెల్లి చంద్రశేఖర్, బంధారపు అజయ్, జాగృతి నాయకులు మేకల తిరుపతి, పిట్టల సత్యం, తిరుపతి పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ వరంగల్–కరీంనగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ చైర్‌పర్సన్లు గందె రాధిక, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సైదాపూర్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు



చొప్పదండి: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



హుజూరాబాద్‌లో నాయకుల రాస్తారోకో

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ బండి సంజయ్

తిమ్మాపూర్: రేణికుంట, కొత్తపల్లి, రామకృష్ణకాలనీ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మళ్లీ రాబోయేది బీజేపీ కాలమేనని, బీజేపీ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ఎంపీ నిధులతో మంజూరైన పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది విద్యార్థులకు కొలువు



ఎంపికైన విద్యార్థులతో చైర్మన్ రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్: మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బి.టెక్, ఎంబీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కొలువులు సాధించారు. వెరైటీ నాలెడ్జ్‌పేటి సొల్యూషన్స్ హైదరాబాద్ సంస్థ ట్రైనీ ఉద్యోగాలకు ఇటీవల శ్రీచైతన్యలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఇందులో కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి కొలువులు సాధించారు. వీరి వార్షిక వేతనం రూ.5.4లక్షలని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా నిర్వహించిన పీపీటీ ప్రజెంటేషన్, మౌఖిక పరీక్ష, టెక్నికల్ ఇంటర్వ్యూ ఆధారంగా విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రసాదరాజు, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు కంపెనీలో ఉద్యోగ నియామకాలకు కట్టుబడి ఉండాలని, వారు చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేయాలని, భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను చైర్మన్, ప్రిన్సిపాల్‌తో పాటు హెచ్‌వోడీలు, అధ్యాపకులు అభినందించారు.

గర్శకుర్తిలో తాగునీటికి తంటాలు

గంగాధర: గర్శకుర్తి గ్రామంలో మంచినీటి బావుల నుంచి నీటి సరఫరా చేసే పైపులైన్ కట్ కావడంతో నీటి సరఫరా నిలిచి మహిళలు తంటాలు పడుతున్నారు. ఆరు రోజులుగా గ్రామంలో నల్లాల ద్వారా నీరు సరఫరా కావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని శనివారం గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారికి సమాచారమిచ్చారు. సమస్యపై ఆరా తీసిన డీపీవో ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. శనివారం సాయంత్రం నుంచి గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా గ్రామంలో నీరందిస్తున్నారు. పైపులైన్ మరమ్మతు చేసి నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పోషకాహారం తీసుకోవాలి



తిమ్మాపూర్: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, తల్లులు

శంకరపట్నం: కాచాపూర్ అంగన్‌వాడీ పాఠశాలలో శనివారం పోషణ పక్షోత్సవాల కార్యక్రమం జరిగింది. ఏసీడీపీవో అరవింద హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన బలవర్ధమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిరు ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ కవిత, కార్యదర్శి జమున, టీచర్లు శారద, స్వరూప పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మహాత్మానగర్‌లో శనివారం పోషణ పక్షం నిర్వహించారు. కమ్యూనిటీ భవన్‌లో తల్లులకు సమతుల్య ఆహారం, మొదటి వెయ్యి రోజులు, ఇన్ఫంట్ యంగ్ చైల్డ్ ఫీడింగ్ ప్రాక్టీసెస్, పూర్వ ప్రాథమిక విద్య అంశాలపై అవగాహన కల్పించారు. వాగేశ్వరి కళాశాల పిల్లలతో కలిసి పోషణ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్‌వాడీ టీచర్ కవిత, పద్మ, అంబిక, మహాత్మనగర్ ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

రైతుల కల్లాలే అడ్డాగా..



హన్మజిపల్లెలో రైతు మాధవరెడ్డి కల్లంలో బీరు సీసాలు

గన్నేరువరం: ప్రభుత్వం మద్యం విక్రయాలను నిషేధించిన పలు గ్రామాల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నట్లు పలు గ్రామాల ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రతి గ్రామంలో రెండు నుంచి ఐదు వరకు బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతుండేవి. ఈ తరుణంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బెల్టు షాపులను నిషేధించింది. కొద్ది రోజులపాటు స్తబ్దుగా ఉన్నా.. తరువాత మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఎక్కడా ప్రభుత్వ చర్యలు కానరావడం లేదు. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారే తప్పా.. సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శలున్నాయి. రైతుల కల్లాలు, పొలాలు, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలు, ఇతర బహిరంగ ప్రదేశాలను మందుబాబులు అడ్డాలుగా మార్చుకుంటూ యథేచ్ఛగా మద్యం తాగుతున్నారని అంటున్నారు. ఖాళీ సీసాలను అక్కడే ధ్వంసం చేస్తుండటంతో సీసా ముక్కలు పశువులతోపాటు రైతులకు ఇబ్బందిగా మారాయి. తన కల్లంలో మందుబాబులు మందు తాగుతూ వీరంగం సృష్టిస్తున్నారని హన్మజిపల్లె గ్రామానికి చెందిన మాధవరెడ్డి తెలిపారు. ఇటీవల ఖాసీంపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సైతం మద్యం తాగి సీసాలను ధ్వంసం చేశారు. దీనిపై విద్యాకమిటీ సభ్యులు సైతం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మండలవ్యాప్తంగా బెల్టు షాపుల నిర్వహణపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పదోతరగతి పరీక్షల ఏర్పాట్లు పరిశీలన



జమ్మికుంట: వివరాలడిగి తెలుసుకుంటున్న ఎంఈవో శ్రీనివాస్

జమ్మికుంట: ఈనెల 18 నుంచి జరగబోయే పదోతరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను ఎంఈవో విడుపు శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. జమ్మికుంట పట్టణంలో 5, వావిలాలలో ఒకటి మొత్తం ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జమ్మికుంట మండలంలోని మొత్తం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 339, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 622 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతోపాటు టీకుర్తి గ్రామంలోని మోడల్ స్కూల్‌ను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేయగా.. ఏర్పాట్లను ఎంఈవో విడుపు శ్రీనివాస్ పరిశీలించారు. 146 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

వీణవంక: పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. ఘన్ముక్కుల, చల్లూరు, వీణవంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో 315 మంది పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు.

హుజూరాబాద్: పదోతరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో కేతిరి వెంకట నర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలోని న్యూ శాతవాహనలో 153 మంది, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 170, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 180, ప్రైవేట్ మాంటిసోరిలో 144, చెల్పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ డిమాండ్ చేశారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న అశోక్‌రెడ్డి

రామడుగు: ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తుంటుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి అశోక్‌రెడ్డి తెలిపారు. వెదిర జిల్లాపరిషత్ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు(1983–84) పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వరంగల్ జిల్లా సంగెం మండల పంచాయతీరాజ్ ఏఈ కంకణాల రమేశ్‌తోపాటు స్నేహితులు శనివారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లతో పాటు పెన్నులు అందజేశారు. జిల్లా సెక్టోరియల్ అధికారి ఆంజనేయులు, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వెదిర పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి అశోక్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి ఆంజనేయులు తనిఖీ చేశారు.

శంకరపట్నం: కన్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు శనివారం మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు బహూకరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మానకొండూర్‌రూరల్: పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, మోరల్ వాల్యూస్‌పై తరగతులు నిర్వహించడం చేపట్టి ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంఈవో మధుసూదనాచారి అన్నారు. వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. తల్లిదండ్రులతో సమావేశం అనంతరం పిల్లలు పాటలు పాడారు. నృత్యాలు చేసి ఆనందంగా గడిపారు. ఎంపీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ లక్ష్మి, గ్రామస్తులు సుమన్, కనకలక్ష్మి, హెచ్‌ఎం చంద్రమౌళి, ఉపాధ్యాయురాలు లత తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



తిమ్మాపూర్: కొత్తపల్లి గ్రామంలో మహాలక్ష్మి మహిళా సంఘం సమావేశం శనివారం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నందుకు, మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.10లక్షల చొప్పున రుణమివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఏపీఎం రామ్మోహన్, సీసీ సంపత్‌కుమార్, వీవోఏ స్వరూప, అధ్యక్షురాలు మమత, రాజమణి, స్వరూప, రాజమ్మ, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడి అరెస్ట్

హుజూరాబాద్‌రూరల్: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని శనివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. గంజాయి కేసులో పరారీలో ఉన్న దండుగుల వెంకటేష్ పట్టణంలోని బస్టాండ్‌లో ఉన్నట్లు సమాచారం అందటంతో వెంటనే పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నుస్తులాపూర్‌లో నైట్ క్రికెట్ టోర్నీ

తిమ్మాపూర్: నుస్తులాపూర్‌లో శనివారం రాత్రి నైట్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ టోర్నీని ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మొత్తం 22 జట్లు పాల్గొంటున్నాయని, విజేతకు రూ.10వేలు, రన్నరప్‌కు రూ.5వేలు అందిస్తానని తెలిపారు. మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్, మహ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాదృక్పథం అలవర్చుకోవాలి

సైదాపూర్: ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలతో విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన, సేవాభావం అలవర్చుకోవచ్చని ఎంపీడీవో భూక్య యాదగిరి అన్నారు. శనివారం లస్మన్నపల్లిలో వీఎస్‌ఆర్ కాలేజీ విద్యార్థుల వేసవికాలం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా విద్యార్థులు మారుతూ సమాజాన్ని హేతుబద్ధంగా మార్చాలని ప్రముఖ కాలమిస్టు, జర్నలిస్టు ఎడమ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రిన్సిపాల్ హనుమకుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి, మాజీ సర్పంచ్ రాములు ఉన్నారు.

రసాభాసగా చిగురుమామిడి సర్వసభ్య సమావేశం



కింద కూర్చొని నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

తిమ్మాపూర్: అధికారుల కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని, ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల్లో బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ పోలీసులు చోద్యం చూస్తున్నారని బొమ్మనపల్లి ఎంపీటీసీ మల్లేశం ఆరోపిస్తూ కింద కూర్చొని నిరసన తెలిపారు. ఆయనకు మద్దతుగా ఎంపీటీసీ సభ్యులంతా నిరసనలో పాల్గొన్నారు. బెల్ట్ షాపులు మూయిస్తానని హామీ ఇచ్చేంతవరకు సభలో కూర్చోమని తెగేసి చెప్పడంతో.. ఎక్సైజ్ ఎస్సై శ్రీకాంత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన ముగించారు. చిగురుమామిడి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ కొత్త వినీత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు నివేదికలు చదివి వినిపిస్తుండగా.. పలువురు ఎంపీటీసీ సభ్యులు గ్రామాల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని ఎంపీపీ, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో కెనాల్ అధికారులు పర్యవేక్షించకపోవడంతో రైతులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ స్వప్న అన్నారు. ఎంపీటీసీగా గెలిచి ఐదు సంవత్సరాల కాలం గడిచిపోతున్న క్రమంలో ఒక్కసారి కూడా కెనాల్ అధికారులు మీటింగ్‌కు హాజరు కాకపోవడం విడ్డూరమన్నారు. చెరువులో నీరు నింపకపోవడంతో పంట కాలంలో రైతులు నష్టపోతారని ఎంపీటీసీ జమున అన్నారు. విద్యాశాఖ అధికారులు అధికార కార్యక్రమాల్లో సభ్యులను కార్యక్రమాలకు పిలవకుండా గౌరవించడం లేదని పలువురు ఆరోపించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో అధికారులు చొరవ తీసుకొని ప్రతి శాఖ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని స్పెషల్ అధికారులకు సూచించారు. ఎంపీడీవో మధుసూదన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గన్నేరువరం: వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. సాంబయ్యపల్లెలో రూ.5లక్షలతో చేపట్టే సీసీ పనులు, ఖాసీంపేటలో ప్రభుత్వ పాఠశాల మరమ్మతులు, సెంట్రల్ లైటింగ్, మాదాపూర్‌లో పైపులైన్, మైలారంలో రూ.5లక్షలతో మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణ పనులు, చొక్కారావుపల్లె రూ.1.50లక్షలతో సింగిల్‌ఫేస్ విద్యుత్ సరఫరా పనులు, తాగునీటి సౌకర్యం కోసం రూ.2లక్షలతో బోరింగ్ పనులు, రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ.4.50లక్షలతో రెడ్డి సంఘం భవన నిర్మాణ పనులు, రూ.4.50లక్షలతో యాదవ సంఘం భవన నిర్మాణం, రూ.3.50లక్షలతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ, జంగపల్లిలో కురుమ సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేశం, మాజీ సర్పంచులు నర్సింహారెడ్డి, రేణుక, చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సంపత్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి ఇందిరానగర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు వేల్పుల విజయకుమార్ ఆధ్వర్యంలో శనివారం సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రణవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జడల అశోక్, ఎనగందుల సమ్మయ్య, సమ్మయ్య, రాజేశం, కొక్కుల శ్రీనివాస్, జెడుల సుధాకర్, కంది నరసింహారెడ్డి, కంది ప్రభాకర్‌రెడ్డి, మద్దెల బన్నీ, జడత సత్తయ్య, దేవి తదితరులున్నారు.

పుస్తెమెట్టెల అందజేత

చొప్పదండి: గుమ్లాపూర్ గ్రామంలో మండల మల్లేశం–భాగ్యలక్ష్మి కూతురు వివాహం సందర్భంగా కరీంనగర్ డెయిరీ వారి ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు రూపురెడ్డి ప్రైలాబ్, సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి వెల్మ రఘుపతిరెడ్డి, సూపర్‌వైజర్ బాపురెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.